కాంగ్రెస్ అరాచక పాలన

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం,జనవరి13: రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగిస్తున్నదని, ప్రశ్నిస్తున్న తమ పార్టీ నేతలపై కుట్రపూరితంగా పోలీస్ కేసులు నమోదు చేస్తున్నారని మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ధర్మారంలో పార్టీ సీనియర్ నేత పూస్కూరు జితేందర్ రావు, పాకాల రాజయ్యతో పాటు నాయకులు విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీఆర్ ఎస్ నాయకుడు పైళ్ల శేఖర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేక అక్కడి తమ బీఆర్ఎస్ కార్యాలయంపై దౌర్జన్యం చేసి ధ్వంసం చేశారని మండిపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడడానికి అవకాశం ఇవ్వగా సంజయ్ కుమార్‌ను ఏ పార్టీకి చెందిన ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నిస్తే ఆయనను సమావేశం నుండి పోలీసులు బలవంతంగా బయటకు పంపించి ప్రశ్నించే గొంతు నొక్కారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి అడిగిన దానికి సమాధానం చెప్పాల్సిన సంజయ్ కుమార్ ఆ సమయంలో కౌశిక్ రెడ్డిని తోసి వేశారని అన్నారు. కానీ కౌశిక్ రెడ్డి దాడి చేసినట్లుగా చిత్రీకరించి అతనిపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పూస్కూరు రామారావు, గుర్రం మోహన్ రెడ్డి, కాంపల్లి చంద్రశేఖర్,తుమ్మల రాంబాబు,ఆవుల శ్రీనివాస్,ఆవుల వేణు,ఆవుల లత,కోమటిరెడ్డి మల్లారెడ్డి, ఐత వెంకట స్వామి, సల్వాజి మాధవరావు,దేవి రాజారాం, మార్క బాలయ్య, బొంగాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

పెద్దపల్లి కమాన్: భోగి మంటలు కాగుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు

రామగిరి : భోగి మంటల వద్ద సింగరేణి యువ బలగం టీం సభ్యులు.

మంథని/పెద్దపల్లి కమాన్/సుల్తానాబాద్/ జూలపల్లి/ఓదెల/రామగిరి/కోల్‌సిటీ/ జనవరి 13 : జిల్లాలో సంక్రాంతి పండుగ సంబురాలు మొదలయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు భోగి వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు, యువతులు కల్లాపి చల్లి..రకరకాల రంగులతో వేసిన అందమైన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్నారుల నెత్తిన అమ్మమ్మలు, నాన్నమ్మలు, అక్కయ్యలు భోగి పండ్లు పోసి ఆశ్వీదించారు. జిల్లా కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో నిర్వహించిన గోదారంగనాయక స్వామి కల్యాణమహోత్సవంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఏసీపీ దంపతులను సన్మానించారు. పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి సుల్తానాబాద్‌లోని తన ఇంటి ముందు వేసిన 'వ్యసనాల ఉచ్చులో యువత' ముగ్గు అందరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా నీతారెడ్డిని పలు అభినందించారు. సుల్తానాబాద్‌లో వాకర్స్ అసోసియేషన్, గాంధీనగర్ ఆదర్శ యూత్, జవహర్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. గోదావరిఖని గాంధీనగర్‌లో గల ఎండీహెచ్‌డబ్ల్యుఎస్ అనాథ పిల్లల ఆశ్రమంలో వ్యవస్థాపకుడు పోచంపల్లి రాజయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో సెంటినరీకాలనీలో కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు ఏర్పాటు చేశారు. యువ బలగం టీం సభ్యులు మాట్లాడుతూ మకర సంక్రాంతి పండగకు ముందు రోజు వచ్చే భోగి పండుగ సందర్భంగా పిడకలు, కట్టెలు, పాత వస్తువులను భోగి మంటల్లో వేడుకలను ప్రారంభిస్తారు. కార్యక్రమంలో బూడిగ క్రాంతి, మేకల మారుతి, సతీశ్, గుండం సురేశ్, సదానందం, హరిబాబు, అఖిల్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : హరిపురంలో భోగి మంటలు పెట్టిన గ్రామస్తులు

పెద్దపల్లి కమాన్: 'వ్యసనాల ఉచ్చులో యువత' ముగ్గు వేస్తున్న ట్రినిటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీతారెడ్డి

గాయపడిన అత్కూరి సతీశ్, అత్కూరి అనూష, కీర్తి

రెండు నిమిషాల్లో ఇంటికి..

అంతలోనే ప్రమాదం

- కుక్కను తప్పించబోయి లారీని ఢీకొన్న కారు
- తండ్రి, పదొకొండు నెలల కొడుకు మృతి
- పండుగ పూట విషాదం

గిన్నరావు సతీశ్(ఫైల్), నవీశ్(ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 13 : హైదరాబాద్‌కి వెళ్లి తిరిగి ఇంటికి మరో రెండు నిమిషాల్లో చేరుకునే క్రమంలో ఘోర ప్రమాదం జరిగింది. కుక్కను తప్పించబోయి ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో తండ్రితోపాటు పదొకండు నెలల బాబు మృతిచెందడం విషాదం నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన గిన్నారపు సతీశ్ (32) సింగరేణి జీడీకే-11 ఇంక్లైన్‌లో బదిలీ ఫిల్లర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు సోదరుడైన కరీంనగర్‌కు చెందిన కిన్నెర చందుకు ఇటీవల పాప పుట్టింది. ఆ పాప హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో ఉండగా.. చూసేందుకు ఆదివారం ఉదయం భార్య కీర్తి, 11 నెలల కొడుకు నవీశ్‌తోపాటు అదే యైటింక్లయికాలనీకి చెందిన తన బావ ఆత్కూరి సతీశ్, అతని భార్య అనూషతో కలిసి కారులో వెళ్లాడు. తిరిగి ఆదివారం రాత్రి 11గంటల తర్వాత ఇంటికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపానికి చేరుకున్నారు. ఇంకో రెండు వందల మీటర్ల వెళ్లే ఇంటికి చేరుకునే వారు. కానీ, అంతలోనే డివైడర్ వైపు కుక్క సడెన్‌గా అడ్డుగా వచ్చింది. దానిని తప్పించేందుకు కారును ఎడమవైపు తిప్పగా అక్కడ పార్క్ చేసి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో కారునడుపుతున్న గిన్నారపు సతీశ్ తలకు, వెనకాల కూర్చున్న అతని కొడుకు నవీశ్‌కు బలమైన గాయాలయ్యాయి. మిగతా ముగ్గురు సైతం గాయపడగా, స్థానికుల సమాచారంతో 108 ద్వారా గోదావరిఖని ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గిన్నారపు సతీశ్, అతని కొడుకు నవీశ్ మృతిచెందారు. మిగతా ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మృతుడి సోదరుడు ఉదయ్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను బంధువులకు అప్పగించగా, వారి స్వస్థలమైన తిమ్మాపూర్ మండలం పోరండ్లకు తరలించారు. కాగా, లారీని ఎలాంటి హెచ్చరికలు బోర్డు, పార్కింగ్ లైట్లు లేకుండా నిలపడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. లారీ వెనకాల కారు ఇరుక్కొని పోవడంతో పోలీసులు, పెట్రోకారు, బ్లూకోర్ట్సు సిబ్బంది ఫైర్ సిబ్బంది కారును తాళ్లతో బయటకు తీశారు.

గని కార్మికుడి మృతిపై సంతాపం

గోదావరిఖని, జనవరి 13: జీడీకె 11 ఇంక్లైన్ కార్మికుడు గిన్నారపు సతీశ్, అతని కుమారుడు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు సతీశ్, అతని కుమారుడి మృతదేహాలను ప్రభుత్వ దవాఖానలో సందర్శించి నివాళులర్పించారు. ఇక్కడ యూనియన్ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ-1 బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం, జీఎం కమిటీ మెంబర్ సిద్దమల్ల రాజు, పిట్ సెక్రటరీలు నాయిని శంకర్, గొడిశల నరేశ్ నాయకులు చెప్యాల భాస్కర్, తాళ్ళపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు వీడాలి

పెద్దపల్లి టౌన్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. సోమవారం స్థానిక సీఐటియూ కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర 4వ, మహాసభల కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడారు. కార్మిక వర్గ పోరాడి సాధించిన కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక వర్గానికి తీరని నష్టం చేసిందని ఆరోపించారు. వ ప్రజలకు ఇచిచన వాగ్దానాలు అమలు చేయాలని ఎన్ని ఉద్యమాలు చేసిన ఫలితం శూన్యంగా మారిందని చెప్పారు. జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఎం మహాసభలకు వేలాధిగా కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సిపిఏం జిల్లా కమిటి నాయకులు కల్లేపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, మోదుంపల్లి శ్రావన్, వెంకట స్వామి, ఎండీ ఖాజా, నరేశ్, అశోక్,తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

రామగిరి, జనవరి 13: లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మండలంలోని సెంటినరీకాలనీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంకు రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ ముఖ్యతిథిగా హాజరై రోడ్డు భద్రత, నియమాల గురించి వివరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దనానరు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, డైరెక్టర్లు గంట వెంకటరమణారెడ్డి, డా.శరణ్య మారుతి యాదవ్, కళాధర్ రెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి, రాజ్‌కుమార్, క్లబ్ సభ్యులు శ్రీనివాసచారి, సురేశ్, సింగరేణి యువ బలగం సభ్యులు క్రాంతి, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి ఆలయంలో బోనాల వేడుకలు

పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

మంథని, జనవరి 13: భగత్‌నగర్‌లోని శ్రీ చెన్న పర్వతాల మల్లన్న స్వామి ఆలయంలో భక్తులు సోమవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు పసుపు బండారు, డోలు వాయిద్యాల మధ్య మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించగా వార్డులోని మహిళలంతా స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌నగర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పతంగులు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోండి

పెద్దపల్లి, జనవరి13: సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్ ఫార్మర్‌లకు సమీపంలో పతంగులు ఎగురవేయొద్దని, బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగరవేయాలని కోరారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద కైట్స్‌ఎగరవేయడం ప్రమాదకరమన్నారు. గ్లాస్ కోటింగ్ లేని కాటన్ మాంజాలను మాత్రమే వాడాలని, నైలాన్, సింథటిక్ మాంజా, మెటాలిక్ మాంజాలకు విద్యుత్ సరఫరా అవుతుందని, అవి విద్యుత్ లైన్లపై పడితే కరెంట్ షాక్ కొట్టే ప్రమాదం ఉంటుందన్నారు. పతంగులు, మాంజాలు విద్యుత్ లైన్లపై పడినప్పుడు వాటిని వదిలేయాలని, వాటిని లాగితే కరెంట్ తీగలు ఒకదానికొకటి తగిలి ప్రమాదం సంభవిచ్చవచ్చని పేర్కొన్నారు. పిల్లలు పతంగులు ఎగరవేసేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని కోరారు.

కోరుకంటి ప్రీమియర్ క్రికెట్ పోటీలు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కోల్‌సిటీ, జనవరి 13: కోరుకంటి ప్రీమియర్ లీగ్ రామగుండం నియోజ కవర్గ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జనగామ శివారు క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ క్రికెట్ పోటీలలో మొత్తం 24 టీంలు పాల్గొంటున్నట్లు ఆర్గనైజర్ జితేందర్ తెలిపారు. కాగా, ఐదు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలలో ప్రతి ఇన్నింగ్‌కు ఆరు ఓవర్లు నిర్దేశించగా, తొలిరోజు పలు జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు కొనసాగాయి. పోటీలలో విజేతగా నిలిచే జట్టుకు రూ.20వేల నగదు, రన్నర్ జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతి ప్రకటించిన విషయం విధితమే. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు రజిత రవీందర్,జనగామ కవిత సరోజని, బీఆర్ఎస్ నాయకులు అచ్చవేణు, తోకల రమేశ్, బొడ్డుపల్లి రవీందర్‌తోపాటు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

డివిజన్ అధికారులతో క్రిటికల్ మినరల్స్ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 13 : సింగరేణి డివిజన్ అధికారులతో విజ్ఞాన దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రిటికల్ మినరల్స్‌పై సమావేశం నిర్వహించారు. సోమవారం ఆర్జీ-2 ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రొఫెసర్ మోహన్ యెలిశెట్టి హాజరై క్రిటికల్ మినరల్స్, ఇండియన్ మినరల్స్, ఓసీపీ, సింగరేణి వరల్డ్ తదితర అంశాలపై చర్చించారు. క్లిష్టమైన ఖనిజాల ప్రపంచం, భారతీయ దృశ్యం, ఓసీపీ ప్రాజెక్టు పునరావాసాల్లో సింగరేణి ప్రపంచ ఉత్తమ విధానాలకు అవకాశం అనే అంశంపై అధికారులకు క్లుప్తంగా వివరించారు. ఆనంతరం ప్రొఫెసర్‌ని జీఎంలు సత్కరించారు. సమావేశంలో జీఎంలు బండి వెంకటయ్య, డీ లలిత్‌కుమార్, ఎన్. సుధాకర్‌రావు,కే వెంకటేశ్వర్లు, కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అన్ని ఏరియాల ఏజీఎంలు, ఎస్‌వోటూ జీఎంలు, పీవోలు పాల్గొన్నారు.

భగవద్గీతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం...

పెద్దపల్లి రూరల్, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి మండలంలోని పలుగ్రామాల్లో త్రైత సిద్దాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో బాగంగా సోమవారం పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి, రాగినేడు గ్రామాల్లో భగవద్గీతపై అందులోని అంశాలపై ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార సంస్థ అధ్యక్షులు, సభ్యులునిరంజన్, రాజు, రవిందర్‌రెడ్డి, దేవేంద్ర, నాగిరెడ్డి, సతీష్ చారి, శంకర్, సాయి, వెంకట్, రాహుల్, లతా ధనలక్ష్మి, శ్రీదేవి, జ్యోతి, చంద్రవ్వ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

గాయని పద్మకు నంది అవార్డు

గోదావరిఖని, జనవరి 13: భాషా సంస్కృత శాఖ ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లాలో జరిగిన ఆదర్శ కళా సేవా సంస్థ వారు 25వ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవంలో రామగుండం నగరపాలక సంస్థ 9వ డివిజన్ జనగామకు చెందిన గాయని కామెర పద్మకు నంది అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ ధూంధాం కళాకారులు కవి గాయకులు అంతడుపుల నాగరాజు, నేర్నాల కిషోర్, గాయకురాలు అంతడపుల రమాదేవి, ప్రముఖ రచయిత, కవి గాయకులు తెల్లం మురళి మధు ఈ పురస్కారాన్ని పద్మ అందజేశారు. ఆదర్శ కళా సేవాసంస్థ అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం, మాధురిరాజాకు పురస్కార గ్రహీత పద్మ కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక..

కాల్వశ్రీరాంపూర్, జనవరి13: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేక కూనారం గ్రామానికి చెందిన దొమ్మటి ప్రసన్నకుమార్(18) సోమవారం ఇంట్లో ఫ్యాన్ కు ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఆనందం తెలిపిన వివరాల ప్రకారం ప్రసన్నకుమార్ హన్మకొండలోని మేధా జూనియర్ కాలేజీలో సెకండియర్ చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేదు. తల్లిదండ్రుల కోరిక మేరకు హాస్టల్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన ప్రసన్నకుమార్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసేసరికి చనిపోయి కనిపించాడు. తండ్రి దొమ్మటి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపాడు.

షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలన

జ్యోతినగర్(రామగుండం), జనవరి 13: రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ. 20లక్షలతో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకున్న ఎమ్మెల్యే త్వరితగతిన నిర్మాణ పనులు చెపట్టాలని ఆదేశించారు. ఇక్కడ స్థానిక డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిరిశెట్టి సతీశ్, తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీలు

సుల్తానాబాద్ రూరల్, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా మండలంలోని రేగడి మద్దికుంట, అల్లీపూర్‌లో మహిళలకు సోమవారం ముగ్గులు పోటీ నిర్వహించారు. విజేతలకు నిర్వాహకుడు కోదాటి సాయికిరణ్ బహుమతులను అందజేశారు.

ధర్మారం,జనవరి13: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పత్తిపాకలో నెహ్రూ యువ కేంద్రం, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. యువతులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు బహుమతులు నిర్వహకులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి కిరణ్, ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్,యువజన వలంటీర్ రేష్మవేణి మహేశ్ పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 13: గౌరెడ్డిపేటలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీల్లోని విజేతలకు కొమ్ము అభిలాశ్ ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ము కరుణాకర్, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు జయపాల్ రెడ్డి, అనిల్ చారి, సాదుల వెంకటేశ్వర్లు, రమ్య, కవిత, వాణి, తిరుమల, స్వర్ణలత, పద్మ శ్రీలత, శ్వేత, పావని తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 13: గోదావరిఖని ధర్మాసుపత్రిలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆప్తమాలజీ ఆపరేషన్ థియేటర్‌ను సిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ప్రారంభించారు. అలాగే దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన రోగుల సహాయకుల గది, లేబర్ గది, ఏఆర్‌టీ సెంటర్, ఎంఐసీయూ నైట్ షెల్టర్‌ను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మానవుని దేహంలో కన్ను ప్రధాన భాగమని, దవాఖానలో కంటి శాస్త్రచికిత్సలు చెపడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ దవాఖాన సూపరిండెంట్ డయల్‌సింగ్, ప్రొఫెసర్‌లు డాక్టర్ శ్రీదేవి, వేణుమాధవ్, డాక్టర్ గోపినాథ్, అలేఖ్య, స్టాఫ్ నర్సులు ఉన్నారు.

'ప్రభుత్వ వాహనాల తుక్కు'పై ఆరా!

- నమస్తే కథనంపై వివరాలు సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ అధికారులు

పెద్దపల్లి రూరల్, జనవరి 13: 'ప్రభుత్వ వాహనాలు తుక్కు... తుక్కు' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రభుత్వం నివేదిక కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇంటెలిజెన్స్ అధికారులు పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పాత డీఆర్డీవో కార్యాలయం, జిల్లా ఎక్సైజ్, క్వాలిటీ కంట్రోల్, ట్రెజరీ కార్యాలయాల వద్ద ఉన్న వాహనాలతో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో చాలా కాలంగా నిలిపి ఉన్న ప్రభుత్వ వాహనాలను గతంలో ఎవరు వినియోగించారు, ఇప్పుడు ఎందుకు పక్కన పెట్టారు.. తుప్పు పట్టే దాకా పట్టించుకోకపోవడానికి గల కారణాలేంటని సంబంధిత కార్యాలయాల అధికారుల నుంచి వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో ఒకటి డీఆర్డీవోకు చెందిన వాహనం కాగా, రెండు ప్రజలకు వైద్యసేవలందించే వాహనాలు. మరొకటి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సేవలందించే వాహనంగా ప్రభుత్వానికి నివేదికను ఇంటెలిజెన్స్ అధికారులు పం పించినట్లు తెలిసింది. త్వరలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణ లో ఉన్న భవనాల స్థలం అంతా ఆర్టీసీకి అప్పగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా కార్యాలయాల్లోని సామగ్రిని సమీప ప్రాంతాల్లోని అనువైన చోట్లకు తరలించారు .ఇదిలా ఉండగా తుక్కు తుక్కుగా మారుతున్న వాహనాల గురించి సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సహకార సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

క్యాలెండర్ విడుదల చేస్తున్న పీఏసీఎస్ పాలక వర్గ సభ్యులు

ధధర్మారం,జనవరి13: నంది మేడారం,పత్తిపాక సింగిల్ విండో కార్యాలయాల్లో ఆయా సంఘాల చైర్మన్లు ముత్యాల బలరాంరెడ్డి, నోముల వెంకట్ రెడ్డి వేర్వేరుగా సహకార సంఘాల వార్షిక క్యాలెండర్ -2025ను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నంది మేడారం విండో వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, డైరెక్టర్లు బొడ్డు మల్లయ్య,భారత స్వామి,మోర కొమురయ్య,దీటి శ్రీనివాస్,తమ్మడవేని రాజయ్య,సాయిరి కుమార్,పాలమాకుల తిరుపతిరెడ్డి,ఈదుల శివకుమార్ రెడ్డి, ఇస్లావత్ రూపా నాయక్ ,పత్తిపాక విండో వైస్ చైర్మన్ పసునూటి శ్రీనివాస్, డైరెక్టర్ లు మెన్నేని వెంకటేశ్వర రావు,బద్దం రవీందర్ రెడ్డి,బద్దం లింగారెడ్డి,నిమ్మ మల్లయ్య, విండో సీఈవోలు రాసూరి మల్లేశం,తొర్తి బుచ్చయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ACB శాఖ - 20286, పెద్దపల్లి-505 172.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ (3)తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద)

బ్యాంకు నుండి దిగువ రుణగ్రహీత(లు) **M/s శ్రీ శివ శక్తి బాలింగ్ యూనిట్, యజమాని: శ్రీ అనుమల సతీష్ కుమార్, సర్వే నెం. 144, ఎసిసి క్వాలీ రోడ్, మంచిర్యాల-504 209** వారు పొందిన రుణసదుపాయాల యొక్క అసలు మొత్త